క్లుప్తంగా

చిన్నారులకు చేయూత



చిన్నారుల వివరాలు నమోదు చేసుకుంటున్న సీడీపీఓ

తుగ్గలి : తల్లిదండ్రులను కోల్పోయిన ముగ్గురు చిన్నారులకు చేయూత నందించేందుకు పలువురు ముందుకు వస్తున్నారు. తమవంతు సాయంగా పత్తికొండ మండలం చందోలి వెంకటేశ్వరరెడ్డి రూ.5వేలు, గోవర్ధనరెడ్డి రూ.5వేలు, రంగస్వామి రూ.2,500, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి సైన్యం రూ.6వేలు, హైదరాబాద్ రాజప్ప టీం రూ.10వేల నగదును చిన్నారులకు అందించారు. అలాగే చైల్డ్ వెల్ఫేర్ కేర్ ఆదేశాల మేరకు పత్తికొండ సీడీపీవో లలిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుమిత్రమ్మ మారెల్లకు వెళ్లి చిన్నారులతో మాట్లాడి వారి వివరాలు సేకరించారు. పిల్లల పరిస్థితిపై సీడబ్ల్యూసీకి నివేదిక అందజేస్తామని తెలిపారు.

ప్రజాసమస్యలు పరిష్కరిస్తాం



ప్రజల సమస్యలను వింటున్న ఎమ్మెల్యే

మద్దికెర : ప్రజల సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదు పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు నుంచి 20 అర్జీలు అందాయని వాటిని అధికారులకందించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిత, ఈఓఆర్డీ మద్దిలేటి స్వామి, ఏఈలు మాయంక్, ఉమాకాంత్, సర్పంచులు ఆంజనేయులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసు ఏర్పాటు చేయండి



ఆర్‌ఎం టి.శ్రీనివాసులకు వినతి పత్రం అందజేస్తున్న శాంతికుమార్

దేవనకొండ: మండల కేంద్రం నుంచి ఆదోనికి ప్రతి రోజూ బస్సు సర్వీసు నడపాలని డీవీఎంసీ మెంబర్ కాకర్ల శాంతికుమార్ కర్నూలు జిల్లా ఆర్టీసీ రీజనల్ మేనేజర్ టి.శ్రీనివాసులను కోరారు. సోమవారం కర్నూలులో ఆర్‌ఎంను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో అతి పెద్ద మండలం దేవనకొండ మండలమని, మండలం నుంచి నిత్యం ప్రజలు, రైతులు, విద్యార్థులు ఆదోనికి ఆస్పరి మీదుగా రాకపోకలు సాగిస్తుంటారన్నారు. పంట దిగుబడులను అమ్ముకునేందుకు రైతులు ఆదోనికి వెళ్తుంటారని, విద్యార్థులు చదువుకునేందుకు వెళ్తారని చెప్పారు. ఈ మార్గంలో బస్సు సర్వీసు లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుందని చెప్పారు.

విద్యార్థుల ఇండస్ట్రీయల్ విజిట్



వెల్దుర్తిలో ప్రింటింగ్ ప్రెస్‌ను సందర్శించిన విద్యార్థులు

కృష్ణగిరి(వెల్దుర్తి) : ఇండస్ట్రీయల్ విజిట్‌లో భాగంగా సోమవారం వెల్దుర్తి బాలుర హైస్కూల్ విద్యార్థులు ప్రింటింగ్ ప్రెస్‌ను సందర్శించారు. యజమాని విద్యార్థులకు ప్రింటింగ్ పనిచేయు విధానం, స్పైరల్ బైండింగ్ చేసే విధానాన్ని వివరించారు. హెచ్‌ఎం రామనాయక్ మాట్లాడుతూ ఒకేషనల్ కోర్సుల ద్వారా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. వృత్తి విద్యా ఉపాధ్యాయుడు దేవరాజు పాల్గొన్నారు.



నాగరకణ్వీ- హొన్నూరు కొట్టాల రోడ్డు



మార్లమడికి క్రాస్ నుంచి నాగరకణ్వీ రోడ్డు దుస్థితి

రోడ్డు లేక..బస్సు రాక!

- ఇబ్బందులు పడుతున్న మూడు గ్రామాల ప్రజలు
- ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్న జనం
- విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం

హొళగుంద: మండలంలోని హొన్నూరు, హొన్నూర కొట్టాల, నాగరకణ్వీ గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఆర్టీసీ బస్సులు రాక ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. కర్ణాటకకు ఆనుకొని ఉన్న హొన్నూరు గ్రామ పంచాయతీపై ప్రభుత్వం శ్రద్ధ చూపకపోవడంతో అభివృద్ధి అంతంత మాత్రమే. అధ్వానంగా పొలాల మధ్యనున్న రోడ్డు.. వర్షం వస్తే కనీసం నడవడానికి కూడా రాదు. రోడ్డు లేకపోవడంతో గర్భిణిలు, బాలింతలు, పాముకాటుకు గురైన వారు సకాలంలో వైద్య సేవలందక మధ్యలోనే ప్రాణాలొదిన ఘటనలు అనేకం. ఆయా గ్రామాలుకు బస్సు సౌకర్యం లేక ప్రజలు ఆటోలు, మోటర్‌సైకిళ్లపై మండల కేంద్రానికి చేరుకుంటున్నారు. ఆటోలో పరిమితికి మించి ప్రయాణం చేస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రవాణా సౌకర్యం లేక విద్యార్థులు పాఠశాలలకు వేళలకు హాజరు కాలేకపోతున్నారు. ఇటీవల పల్లెపండుగలో భాగంగా..హొళగుంద నుంచి హొన్నూరు కొట్టాల వరకు 5కి.మీ.మేర బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అయితే.. మార్లమడికి క్రాస్ నుంచి నాగరకణ్వీ, హొన్నూరు, నాగరకణ్వీ-హొన్నూరు కొట్టాల రోడ్లపై దృష్టి సారించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.



ఆటోల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు

మహిళలపై అఘాయిత్యాలను అరికట్టలేరా?

- రెడ్‌బుక్‌పై ఉన్న శ్రద్ధ..మహిళల రక్షణపై చూపండి
- సంక్షేమ పథకాల అమలు గాలికొదిలేశారు
- మద్యం దుకాణాలపై ఉన్న ధ్యాస పాలనపై ఏదీ?
- ఎమ్మెల్యే బి.విరూపాక్షి ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



ఆలూరులో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బి.విరూపాక్షి

ఆలూరు: రాష్ట్రంలో ఏదో ఒక చోట మహిళలపై రోజూ అఘాయిత్యాలు జరుగుతున్నా ప్రభుత్వం చర్యలు చేపట్టడంలో విఫలమైందని ఎమ్మెల్యే బి. విరూపాక్షి అన్నారు. మహిళలు, బాలికలకు రక్షణ కరువైందని, మహిళా హోంమంత్రి ఉండి కూడా వారికి భరోసానివ్వలేకపోవడం దారుణమన్నారు. రెడ్‌బుక్ అమలుపై ఉన్న ధ్యాస సంక్షేమ పథకాల అమలుపై ఎందుకు చూపడం లేదని ప్రశ్నించారు. స్థానిక ఉరుకుంద ఈరన్న కొట్టాల కాలనీలో సోమవారం ఎంపీపీ బోయ ఎల్లమ్మ ఆధ్వర్యంలో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ పాలనలో జగనన్న దిశ చట్టం అమలు చేయడంతో మహిళలపై దాడులకు జంకేవారని, ప్రస్తుతం రోజుకో దారుణం జరుగుతోందని, అయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేకపోవడం, కనీసం బాధితులను పరామర్శించడానికి మంత్రులెవరూ ముందుకు రావడం లేదంటే ప్రజా సంక్షేమంపై వారి చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చన్నారు. మద్యం షాపులు కేటాయించడంలో ఉన్న శ్రద్ధ పాలనపై లేకపోవడంతో అఘాయిత్యాలను అరికట్టడంలో ఘోరంగా విఫలమయ్యారని మండిపడ్డారు. విద్యార్థినులను ప్రేమ పేరుతో ప్రేమోన్మాదులు బలి తీసుకుంటున్నా రక్షించేనాథుడు కరువారయ్యారన్నారు. ఇప్పటికైనా పాలనపై ధ్యాస ఉంచి ప్రజల మాన, ప్రాణాలను కాపాడుతూ, సంక్షేమ పథకాల అమలు చేపట్టాలని సూచించారు. ఎంపీపీ రంగమ్మ, ఎంపీటీసీ దేవరాజ్, మండల కో-కన్వీనర్ వీరేష్, గిరి,నాయకులు వెంకటేశ్వర్లు, ఓబులేసు, గజ్జలప్ప, గుండయ్య, వీరేష్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఆహారం



తుగ్గలి తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ప్రదర్శన

తుగ్గలి : ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుందని ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగరాజు, ఎస్‌ఐ కృష్ణమూర్తి అన్నారు. వ్యవసాయశాఖ- రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంట ఉత్పత్తులను సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం, పెట్టుబడి లేని వ్యవసాయం గురించి సంస్థ మండల ఇన్‌చార్జ్ లింగన్న వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో నాణ్యమైన, ఆరోగ్యకరమైన పంటలు పండించుకోవచ్చన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలను తహసీల్దార్, ఎస్‌ఐ, అధికారులు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో సంస్థ ఐసీఆర్‌పీఎస్ రవి, భాస్కర్, రాముడు, రైతులు పాల్గొన్నారు.

విత్తశుద్ధి తప్పనిసరి

దేవనకొండ: విత్తనం వేసే ముందు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేపట్టాలని ఏఓ సురేష్‌బాబు రైతులకు సూచించారు. మండలంలోని ఐరన్‌బండ గ్రామంలో సోమవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సాగైన వేరుశనగ పంటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. విత్తే ముందు విత్తనశుద్ధి చేసుకోవాలని, 15 సాళ్ల వేరుశనగకు ఒక్క కంది సాలును వేసుకోవాలని చెప్పారు. విత్తన శుద్ధికి ట్రైకోడెర్మావిరిడీ 50 కిలోల విత్తనాలకు కేజీ చొప్పున విత్తన శుద్ధి చేసుకోవాలన్నారు. 20రోజుల పంట కాలంలో వేపనూనె 2.5 ఎం.ఎల్. లీటర్ నీటికి కలుపుకుని, ఆసిఫేట్ 2.5 గ్రాముల నీటిలో కలుపుకుని పిచికారీ చేసుకోవాలన్నారు. విత్తన ఉత్పత్తి అధికారి చైతన్యకుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి రంగన్న, వీపీఏ నరసప్ప, రంగస్వామి, రైతులు పాల్గొన్నారు.

అందుబాటులో శనగ విత్తనాలు

మద్దికెర : మండలంలో రబీ సీజన్‌లో అత్యధికంగా సాగు చేసే పప్పుశనగ విత్తనాలు 150 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని అవసరమైన రైతులు తీసుకెళ్లాలని ఏఓ రవి సోమవారం తెలిపారు. ప్రభుత్వం సబ్సిడీతో అందజేస్తునందని ఆసక్తి గల రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయాధికారులను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కృష్ణగిరి : కంబాలపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని ఎర్రగుడి ఫీడర్‌లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ మద్దిలేటి సోమవారం తెలిపారు. తెల్లవారుజాము 4 నుంచి 10గంటల వరకు, రాత్రి 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

పత్తికొండ(తుగ్గలి) : మండలంలో మంగళవారం నుంచి నిర్వహించే ప్రత్యేక ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ స్వర్ణలత కోరారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 4రోజుల పాటు సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 22నుంచి 25 వరకు పత్తికొండ 1, 2, దూదేకొండ సచివాలయాల్లో క్యాంపులు కొనసాగుతాయన్నారు. ఆయా సచివాలయాల పరిధిలోని ప్రజలు ఆధార్‌లో మార్పులు, చేర్పులు తదితర వాటిని చేయించుకోవచ్చని చెప్పారు.

రేపు దివ్యాంగుల ఉపకరణాలపై సర్వే

ఆలూరు: స్థానిక సచివాలయం-2 ఆవరణలో ఈనెల 23వ తేదీన దివ్యాంగులకు ఉపకరణాలు, గుర్తింపు కార్డుల మంజూరుతో పాటు సర్వే నిర్వహిస్తామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జి.రమాదేవి సోమవారం ఓ ప్రకటనలోతెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన దివ్యాంగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

పోలీస్ పెట్రోల్ బంకు ఏర్పాటుకు భూమిపూజ

ఆదోని అర్బన్: పట్టణంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పక్కన నూతనంగా పోలీసు వెల్ఫేర్ ఫండ్ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు ఏర్పాటుకు సోమవారం భూమిపూజ జరిగింది. డీఎస్పీ సోమన్న, టూటౌన్ సీఐ సూర్యమోహన్‌రావు పూజలు చేశారు. అనంతరం ప్రొక్లెయిన్ ద్వారా మట్టిని తీయించారు. డీఎస్పీ, సీఐలు మాట్లాడుతూ నాణ్యమైన పెట్రోల్‌ను ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. పెట్రోల్ నుంచి వచ్చే ప్రతి రూపాయీ పోలీసు వెల్ఫేర్ ఫండ్‌కు వెళ్తుందన్నారు. 45 రోజుల్లో పెట్రోల్ బంకు నూతన నిర్మాణం పూర్తి అవుతుందన్నారు. ఎస్‌ఐ తిరుపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లేదెలా?



కురుకుందలో ముళ్ల పొదల మధ్యన అంగన్‌వాడీ కేంద్రం

ఆలూరు: అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రహరీ నిర్మించాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నా పరిష్కరించకపోవడంతో పలు గ్రామాల్లోని అంగ్‌వాడీ కేంద్రాల చుట్టూ ముళ్ల కంచె, పిచ్చి మొక్కలు పెరిగి ప్రమాదకరంగా మారుతున్నాయి. మండలంలోని కురుకుంద, హత్తిబెళగల్,మర కట్టు, మూసానపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రహరీలు నిర్మించపోవడంతో కేంద్రాల చుట్టూ కంప చెట్లు పెరిగిపోయాయి. దీంతో ముళ్ల పొదలు విషపురుగులకు ఆవాసాలుగా మారాయి. ఆయా గ్రామాల్లో పొదలు పెరిగి కనీసం రాకపోకలు సాగించడానికి వీలు లేనంతగా మారడంతో పిల్లలను కేంద్రాలకు పంపడానికి తల్లిదండ్రులు జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

తప్పిన ప్రమాదం



చిన్నహ్యేట రోడ్డులో రోడ్డు పక్కన పొలంలో ఒరిగిపోయిన ట్రాక్టర్



అధ్వానంగా ఉన్న చిన్నహ్యేట రోడ్డు

హొళగుంద: మండలంలోని చిన్నహ్యేట రోడ్డులో సోమవారం ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో తృటిలో ప్రమాదం తప్పింది. కోగిలతోటకు చెందిన ట్రాక్టర్‌లో కొందరు భక్తులు ఎల్లార్తి దర్గాలను దర్శించుకుని తిరిగి గ్రామానికి వస్తుండగా ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న బోలేరోకు సైడ్ ఇచ్చే సమయంలో రోడ్డు గుంతలను తప్పించే క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కన పొలంలో ఒరిగిపోయింది. ఆ సమయంలో ట్రాక్టర్‌లో 10 మందికి పైగా భక్తులు చిన్నపాటి మూగదెబ్బలతో బయటపడ్డారు. కాగా చిన్నహ్యేట నుంచి హొళగుంద వరకు రోడ్డు అధ్వానంగా ఉండడంతో పాటు వర్షాల వల్ల మోకాలోతు గుంతలు పడి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు, గ్రామస్తులు తెలిపారు.

పోలీసుల త్యాగం మరువలేనిది



పత్తికొండ సర్కిల్ కార్యాలయంలో అమరులకు నివాళులర్పిస్తున్న డీఎస్పీ, సిబ్బంది



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న సీఐ నాయక్



వెల్దుర్తిలో మానవహారం నిర్వహించిన విద్యార్థులు, పోలీసులు



సంస్మరణ దినోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న ఎస్‌ఐ చంద్ర

పత్తికొండ(తుగ్గలి) : ప్రజల రక్షణ కోసం పోలీసులు చేస్తున్న త్యాగం మరువ లేనిదని డీఎస్పీ వెంకటరామయ్య అన్నారు. పట్టణంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనీ డీఎస్పీ ఉషశ్రీ , అర్బన్ సీఐ జయన్నతో కలిసి అమరులైన పోలీసుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీఎస్పీ మాట్లాడుతూ..పోలీసులు తమ కుటుంబాలను కూడా వదిలిపెట్టి నిరంతరం ప్రజల కోసం కష్టపడుతూ రక్షణ కల్పిస్తున్నారన్నారు. శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసులకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ గోపాల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చిప్పగిరి: పోలీస్ అమరవీరుల స్మారక దినోత్సవం మండల కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు పలు క్రీడా పోటీలు, నిర్వహించారు. ప్రతిభ కనబరచిన వారికి ఆలూరు సీఐ నాయక్ బహుమతులు అందజేశారు. ఎస్‌ఐ సతీష్, ప్రిన్సిపాల్ వరదరాజులు సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణగిరి(వెల్దుర్తి) : పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని సోమవారం వెల్దుర్తిలో ఘనంగా నిర్వహించారు. వెల్దుర్తి, కృష్ణగిరి ఎస్‌ఐలు అశోక్, మల్లికార్జున ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ నుంచి తెలుగుతల్లి విగ్రహం వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అమరవీరులకు రెండునిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ..పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేమని, ఎన్నో సమస్యల మధ్య విధులు నిర్వహిస్తూ సమాజానికి సేవచేసే పోలీసులను గౌరవించాలన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

హాలహర్వి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఎస్‌ఐ చంద్ర ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతలను కాపాడమే లక్ష్యంగా పోలీసులు విధులు నిర్వహిస్తారని, 24 గంటలపాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి అండగా ఉంటారన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమన్నారు. ఈనెల 31వ తేదీ వరకు పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలను ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తామని చెప్పారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న ఏఓ విజయలక్ష్మి, సిబ్బంది



హొళగుందలో ఆర్‌ఎస్‌కే సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఏఓ ఆనంద్ లోకదళ్

చిప్పగిరి: సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏఓ విజయలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాల రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలు తమకు కావాల్సిన ఏ సమాచారం అయినా ఆర్జీ ద్వారా సంబంధిత అధికారికి పంపి సమాచారం కోరవచ్చన్నారు.ఆర్జీ పెట్టుకున్న 30 రోజుల్లో సంబంధిత అధికారుల నుంచి సమాధానం రాకపోతే ఉన్నతాధికారులకు అప్పీలు చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ రమాదేవి,ఎంపీఈఓలు రంగస్వామి,ప్రతాప్ పాల్గొన్నారు.

హొళగుంద: సమాచార హక్కు చట్టం ఎంతో విలువైనదని ఏఓ ఆనంద్ లోకదళ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో రైతు సేవా కేంద్రాల సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ పాలనలో పారదర్శకత, ప్రజలకు అధికారుల జవాబుదారీతనం, అవినీతి రహిత సమాజం కోసం సమాచార హక్కు చట్టం-2005 తీసుకొచ్చారని చెప్పారు. ఏఈఓ విరుపాక్షి, వీపీఏలు, రైతులు పాల్గొన్నారు.

మద్యం షాపును తొలగించండి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు

ఆలూరు: స్థానిక ఎల్లార్తి రోడ్డుకు ఇరువైపుల పాఠశాలలు, కళాశాలలు ఉన్నప్పటికీ మద్యం షాపు ఏర్పాటు చేశారని, వెంటనే రద్దు చేయాలని డీవైఎఫ్ఐ, ఎస్‌ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేస్తూ సోమవారం ధర్నా చేశారు. విద్యార్థుల నిరసనకు మద్దతు ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మీనారాయణ, ఏపీ రైతు సంఘం అధ్యక్షుడు ఈరన్న, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, సీపీఎం మండల కార్యదర్శి షాకీర్, ఐద్వా మండల నాయకురాలు గౌసియా తదితరులు ధార్నాకు సంఘీభావం తెలిపారు. ఈ ప్రాంతంలో దాదాపు 1,500 మంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారని, అయినప్పటికీ ఎక్సైజ్ అధికారులు దుకాణ ఏర్పాటుకు అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం చేరుకొని తహసీల్దార్ గోవిందసింగ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.

వర్షం వస్తే.. కార్యాలయం ఖాళీ!



సోమవారం కురిసిన చిన్నపాటి వర్షానికి వెలుస్తుండటంతో తడిచిన తహసీల్దార్ కార్యాలయం.. సిబ్బంది లేని దృశ్యం



పైకప్పు నుంచి పాటుకు తగ్గడంతో విధులకు హాజరైన రెవెన్యూ అధికారులు

- శిథిలావస్థకు చేరిన తహసీల్దార్ కార్యాలయం
- వర్షానికి వెలుస్తున్న పైనం
- తడిసి ముద్దవుతున్న ఆఫీసు
- విధులు నిర్వర్తించలేక బయటకు వెళ్లిపోతున్న అధికారులు, సిబ్బంది

ఆలూరు: సాధారణంగా నిరసన తెలిపడానికి చిహ్నంగా వాకౌట్ చేయడం చూస్తుంటాం.. కానీ ఆలూరు తహసీల్దార్ కార్యాలయంలో మాత్రం.. వర్షం వస్తే చాలు.. అధికారులు, సిబ్బంది మొత్తం వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోతారు. ఎందుకనుకుంటున్నారా.. శిథిలమైన భవనం కావడం, పైకప్పు వెలుస్తుండటంతో వర్షానికి తడిసి ముద్దవుతుంది. దీంతో ఆఫీసులో కూర్చోలేక బయటకు వెళ్లిపోవడం సాధారణంగా మారింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం శిథిలమై కూలే దశకు చేరుకుంది. ఇప్పటికే పైకప్పు కూలకుండా రెండు కర్రలను సపోర్టుగా పెట్టారు. చిన్నపాటి వర్షం వచ్చినా పాటుకు పెడుతుండటంతో కార్యాలయం తడిసిపోతుంది. ఇక రికార్డులు తడిసి ముద్దవుతున్నాయని అధికారులు వాపోతున్నారు. భద్రపరుచుకునే మార్గం లేదని, దీంతో ఏమి చేయలేని స్థితిలో ఉన్నామని చెబుతున్నారు. వంద ఏళ్లకు పైగా కార్యాలయాన్ని నిర్మించినట్లు అధికారులు చెబుతున్నారు. పైకప్పు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో కార్యాలయం పైభాగంలో వేప, జిల్లేడు, నేరేడు చెట్లు మొలకెత్తాయి. వాటి వేర్లు పైకప్పులోకి చొచ్చుకెళ్లడంతో కప్పు బీటలు వారింది. పడిపోకుండా కర్రలను సపోర్టుగా ఏర్పాటు చేశారు. ఎప్పుడు కూలి ఏమి జరుగుతుందోనని సిబ్బంది భయాందోళనలతో విధులు నిర్వర్తిస్తున్నారు. లోపలికి వెళ్లిన వారు బయటకు వస్తే చాలు మరో జన్మ ఎత్తినట్లుగా భావిస్తున్నారు. నూతన కార్యాలయ నిర్మాణానికి 2020లో ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. సోమవారం చిన్నపాటి వర్షం కురవడంతో కార్యాలయం నుంచి బయటకు వెళ్లక తప్పలేదని డీటీ విజయ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ సుధాకర్‌రెడ్డి వీఆర్వోలు సత్యనారాయణ, చిదానందగౌడు, జూనియర్ అసిస్టెంట్ తెలిపారు.